# విద్యలో సంస్కరణలకు ప్రత్యేక కమిటీ!

- మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వం?



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో విద్యా రంగ సంస్కరణలపై ప్రత్యేక కమిటీ వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై త్వరలో స్పష్టత రానుంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ, పాఠశాల విద్యలో నాణ్యత పెంపు, ఒత్తిడి తగ్గించే బోధన విధానాలను ఈ కమిటీ అధ్యయనం చేసే వీలుంది. విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఉన్నత విద్యపై సమీక్ష ముగిసిన తర్వాత బాలకిష్టారెడ్డి బయటకు వెళ్తుండగా.. 'అన్ని స్థాయిల విద్యా సమీక్షలోనూ మీరు ఉండాలి'అని సీఎం చెప్పినట్టు తెలిసింది. పాఠశాల ఫీజులపై నిపుణుల కమిటీని వేస్తామని సీఎం అన్నట్టు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో ఫీజుల కట్టడికి అనుసరిస్తున్న పద్ధతులపై అధ్యయనానికి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

# మన వర్సిటీలు వరల్డ్ నాలెడ్జ్ సెంటర్లు కావాలి



బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి,
సీఈవో, టీశాట్ నెట్‌వర్క్

'దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమౌతుంది' ఇదే భారతదేశం నమ్మి ఆచరించిన సిద్ధాంతం. ఆగస్టు 25న ఎన్నో ఏళ్ల తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో ప్రసంగించిన తెలంగాణ మొదటి సీఎంగా రేవంత్ రెడ్డి నిలిచారు. విద్యకోసం నిధులను ఎంత కష్టమైనా సర్దుబాటు చేసి, విద్యను అందించే విద్యాలయాల కోసం ఎంతైనా ఖర్చు చేస్తామని ప్రభుత్వాధినేతగా ఆయన చెప్పిన మాటలు ఉస్మానియా యూనివర్సిటీకి భరోసా కల్పించాయి. కేవలం ఏడాది బడ్జెట్‌లోనే రూ. 40వేల కోట్లకు మించి విద్యకు కేటాయించడమే కాకుండా, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, పోలీస్ స్కూల్స్, స్కిల్ యూనివర్సిటీ, రెండు నెలలలోపే ఏకంగా 11వేలకు పైగా టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగింది. విద్యపై సీఎం రేవంత్ రెడ్డికి ఖచ్చితమైన విజన్ ఉందనిపించింది.




మనిషి, తలరాతను మార్చే శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి, కేవలం డిగ్రీ హోల్డర్లను చేయడం కాదు వారిని రాష్ట్రానికి తరగని మేధో సంపత్తిగా చేయాలన్న సీఎం కమిట్‌మెంట్ ఆహ్వానించదగ్గది. నిజంగా అందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు బాగా తోడ్పడే అవకాశాలున్నాయి.

**తెలంగాణకు పర్యాయపదం ఓయూ**

ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణకు పర్యాయపదమని ప్రారంభించిన ఉపన్యాసంతోనే సీఎం రేవంత్ రెడ్డి ఓయూ ప్రతిష్ట ఎంతటిదో ఒక్క వాక్యంలోనే అందరికీ అర్థమయ్యేలా చేశారు. 1917లో నిజాం తెలంగాణ విద్యావ్యవస్థకు దేదీప్యమాన భవిష్యత్తును కాంక్షిస్తూ ప్రారంభించిన యూనివర్సిటీ నాటి లక్ష్యాలను వివరించారు. సీఎం చెప్పినట్టు.. దేశాన్ని ఆర్థిక సరళీకరణ మంత్రంతో ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్ది నేడు మూడో అతిపెద్ద ఎకానమీగా మారడంలో బలమైన పునాది వేసిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సహా, దక్షిణ భారతంలోనే తొలి ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి వంటి మహనీయులు ఓయూ నుంచే వచ్చారు. విద్యలో రాజకీయాలు ఉండవు అనే సూత్రాన్ని స్వయంగా సీఎం వివరించారు. పార్టీలకతీతంగా జార్జిరెడ్డి, గద్దరన్న వంటి ఓయూ పూర్వ విద్యార్థుల్ని స్మరించుకున్నారు. ఉస్మానియా ఘన వైభవానికి, నిజ చేతనకు మచ్చుకగా స్థాపించిన నిజాం నిరంకుశత్వాన్ని సైతం 1935లో పీవీ హయాం నాటికే ధిక్కరించిన వైనం ఉంది. అదే వేదికపై ఉన్న సీపీ సీపీ ఆనంద్ సహా ఎంతోమంది ఆలిండియా సర్వీస్ అధికారులు, ఇంజనీర్లు, డాక్టర్లతో పాటు రాష్ట్రాన్ని సాధించుకున్న గొప్ప ఉద్యమకారుల్ని సైతం ఓయూ అందించినవారే.

**ఉద్యమానికి ఊపిరి**

మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఓయూ నిలిచింది. ఉస్మానియా యూనివర్సిటీ ఎందరో నాయకులను అందించింది. రాజకీయ పార్టీల సొంత ఎజెండాలు, నాడు స్వరాష్ట్ర సాధన కోసం వచ్చిన డిసెంబర్ 9 ప్రకటన, దాని అనంతరం ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో రాజకీయ జేఏసీ ఏర్పాటు వరకు ఓయూ పాత్రను స్మరించుకున్న తీరు ప్రతి ఒక్కరినీ మరోసారి నాటి రోజులకు తీసుకెళ్లింది. కేవలం విద్య, పోరాటాల వేదికగానే కాకుండా యావత్ తెలంగాణకు ఓయూ గుండెకాయ. తెలంగాణలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా దానిపై జరిగే తొలి చర్చావేదిక ఉస్మానియా యూనివర్సిటీ అవుతుందని, అది అలాగే ఉండాలని ఆకాంక్షించిన సీఎం రేవంత్ రెడ్డికి ఎంత స్పష్టమైన అవగాహన ఉందో తెలిసింది.

**విద్యార్థుల్లో జోష్**

గత పదేండ్లలో ప్రశ్నించే గొంతుక, తమని ఎదురించే శక్తి ఉండకూడదనే లక్ష్యంతో సిబ్బందిని భర్తీ చేయక, వీసీలను నియమించక, యూనివర్సిటీలను కుంటుపడేలా చేసి, మళ్లీ గొర్లు, బర్లు కాసే దిశగా సమాజాన్ని తీసుకెళ్లడానికి చేసిన కుట్రల్ని బట్టబయలు చేశారు. ప్రశ్నించే విద్యార్థులే సమాజానికి చోదక శక్తులౌతారని, తమను ఆపేచేసేవారెవరు, తమ గొంతు వినేవారెవరో.. తెలుసుకునే విచక్షణను విద్యార్థులు ఎప్పుడూ వదలొద్దని సూచించారు. అందువల్ల విద్యార్థుల చైతన్యాన్ని సొంత ప్రయోజనాల కోసం ఎవరూ వాడుకోలేరనే సత్యం వెలుగు చూస్తుంది. గత పాలకులు అవివేకంతో దోపిడీతో వట్టిపోయిన ఖజానాకు ఆయువునిచ్చి అందించడం సులభం కాదు. అయినా, సీఎం రేవంత్ ఆ భరోసా ఇచ్చారు. స్వయం పాలన కోసం గొంతెత్తిన యూనివర్సిటీలోనే గత పదేళ్లలో నిర్బంధాలు అమలయ్యాయి. వచ్చే డిసెంబర్లో మళ్లీ యూనివర్సిటీకి వస్తానని, ఈసారి ఏ పోలీసు పహారా లేకుండా న్యాయబద్ధ నిరసనల్ని సైతం వింటానని తేల్చిచెప్పారు. అలాగే, అదే సమయంలో యూనివర్సిటీకి కావాల్సిన ప్రతీది అందిస్తానని అందుకోసం ఖర్చుకు భయపడకుండా ప్రణాళికల్ని రూపొందించుకోవాలని చెప్పడం విద్యార్థుల్లో జోష్‌ను నింపింది.

**వరల్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా..**

విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులతో పాటు ముఖ్యమంత్రి సైతం విధిగా అందుబాటులో ఉండాలి. నిజానికి ఈ విషయం గతంలో సాధ్యపడలేదు. సీఎంగా బాధ్యతలు తీసుకున్నాక రేవంత్ రెడ్డి ఇప్పటికే అంబేద్కర్ యూనివర్సిటీలో పర్యటించారు. ఇప్పుడు ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ సమస్యల్ని గమనించారు. మరోసారి వస్తానని మాటిచ్చారు. దీంతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలను సీఎం సందర్శించాలి. తద్వారా అక్కడి ప్రమాణాలు మరింతగా మెరుగుపడతాయి. ఇది కేవలం ఉన్నత విద్యలో నాణ్యత పెంచడమే కాదు. సీఎం రేవంత్ అన్నట్టుగా యావత్ తెలంగాణ సమాజానికి మేధో విజ్ఞాన భాండాగారాన్ని సృష్టిస్తుంది. 18 నుంచి 35 ఏళ్ల యువత 70శాతం ఉన్న మన తెలంగాణ రాష్ట్రం రాబోయే రోజుల్లో వరల్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా రూపాంతరం చెందేలా సీఎం కృషి చేయాలని ఆశిద్దాం.

## ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించాలి: వీసీ



ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న జేఎన్‌టీయూ వీసీ టీకేకే రెడ్డి, సైబర్ వాల్‌నెట్ సీఈవో ప్రసాద్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులను సరి కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైబర్ వాల్ నెట్ సంస్థ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నెక్స్ట్ జనరేషన్ సైబర్ సెక్యూరిటీ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం జేఎన్‌టీయూతో ఒప్పందం కుదిరింది. ఈ మేరకు వీసీ, సైబర్ వాల్ నెట్ సీఈవో ప్రసాద్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఇరువురు మార్చుకున్నారు. రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షి ప్రసాద్, సుల్తాన్‌పూర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహ పాల్గొన్నారు.

### ఐబీబీఎంపీ విద్యార్థులతో ముఖాముఖి

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ, జర్మనీ రాయ్‌ట్లింగెన్ యూనివర్సిటీతో ఒప్పందంలో భాగంగా నిర్వహించనున్న ఐదున్నరేళ్ల ఐబీబీఎంపీ(ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచలర్స్ అండ్ మాస్టర్స్ ఇన్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్) కోర్సులో ప్రవేశం తీసుకున్న విద్యార్థులతో శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్మనీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సమన్వయకర్త రమణయ్య, ఫారెన్ రిలేషన్స్ డైరెక్టర్ డాక్టర్ కె.సుప్రీతి తదితరులు పాల్గొన్నారు

## సైబర్‌వాల్ నెట్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం

బాలానగర్: సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ అండ్ ట్రెనింగ్ కంపెనీ, సైబర్‌వాల్ నెట్‌తో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సుల్తాన్‌పూర్, జేఎన్‌టీయూ ఎంఓయు ఒప్పందం చేసుకుంది. సైబర్ సెక్యూరిటీ డొమైన్‌లో విద్య, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ అవగాహన ఒప్పందం లక్ష్యాలు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ టి. కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ కె. విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. నరసింహ, సైబల్‌వాల్ నెట్ సీఈఓ పాలేపు శ్రీప్రసాద్ పాల్గొన్నారు.

